నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 12 ఫిబ్రవరి 2025 | HYDERABAD

సికింద్రాబాద్, రాంగోపాల్ పేట డివిజన్‌లోని నల్లగుట్ట ప్రాంతంలోని నాలా ఇది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాలా పూడిక తీశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ నాలా పూడిక తీసిన పాపాన పోలేదు. నాలాలో దుర్గంధం పేరుకుపోయి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. స్థానిక కార్పొరేటర్‌కు పలుమార్లు చెప్పినా.. పెడచెవిన పెడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

తమ సమస్యలను పరిష్కరించాలని బర్కత్‌పురాలోని భవిష్య నిధి భవనం ముందు ధర్నా చేస్తున్న రిటైర్డ్ పెన్షనర్లు

గృహిణులూ.. జర జాగ్రత్త!

మహిళలనే టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్‌లో నివాస ముంటున్న ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా ఓ లెహంగా కనిపించింది. అది బాగా నచ్చడంతో పూజా కలెక్షన్స్ పేరుతో ఉన్న పేజీలోకి వెళ్లింది. అక్కడ సూచించిన స్కానర్‌కు రూ.1000 చెల్లించింది. డబ్బులు చెల్లించి రెండు రోజులైనా ఆర్డర్ పెట్టిన లెహంగా రాకపోవడంతో పేజీలో కనిపించిన నెంబర్‌కు కాల్ చేసింది. ఈ సమయంలో ఖాతా తనిఖీ పేరుతో సైబర్ మోసగాళ్లు ఆమె అకౌంట్ నుంచి రూ.40వేలు కొట్టేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ ఇటీవల ఓ యాప్‌లో ఫుడ్ ఆర్డర్ పెట్టి వెంటనే క్యాన్సిల్ చేసింది. తర్వాత కొద్దిసేపటికే ఒకరు కాల్‌చేసి యాప్ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పారు. ఆర్డర్ రద్దు చేశాక మనీ ట్రాన్స్‌ఫర్ అయిందో లేదో తెలుసుకునేందుకు ఓ లింక్ పంపిస్తున్నట్లు చెప్పారు. నిజమేనని నమ్మి ఆ మహిళ లింక్ క్లిక్ చేసింది. ఆమె ప్రమేయం లేకుండానే అకౌంట్ నుంచి రూ.1.44లక్షలు బదిలీ అయ్యాయి. ఇలా ఒకట్రెండు కాదు.. హైదరాబాద్ నగరంలో ఇలాంటి ఘటనలు ప్రతిరోజు ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. డిస్కౌంట్ల పేరుతో సంస్థలు ఇచ్చే ఆఫర్లు చూసి మోసపోయి డబ్బులు పోగొట్టుకుంటున్న మహిళలు ఎంతో మంది ఉన్నప్పటికీ .. కొందరు మాత్రమే పోలీస్‌స్టేషన్లకు వచ్చి ఫిర్యాదు చేస్తుండటంతో ఈ మోసాలు వెలుగు చూస్తున్నాయి.

ఆఫర్లు చూసి మోసపోవొద్దు..

ప్రత్యేక రోజులు, పండుగల సందర్భంగా పలు సంస్థలు ఆఫర్లు ప్రకటిస్తాయి. దీన్ని ఛాన్స్‌గా తీసుకున్న సైబర్ నేరగాళ్లు.. అదే తరహాలో ప్రకటనలు ఇచ్చి మోసం చేస్తారు. భారీ డిస్కౌంట్ అంటే ఆశపడి లింక్ క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కినట్టే. ఇన్‌స్టాగ్రాం, టెలీగ్రాంలలో ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతే కాకుండా ఈ కామర్స్ ప్లాట్ ఫామ్స్‌లో జరిగే లావాదేవీల సమాచారం గంటల వ్యవధిలో సైబర్ నేరగాళ్ల చేతికి చేరుతుంది. సంస్థల ముసుగులో నకిలీ, ఆఫర్ల ప్రకటనలు పంపిస్తున్నారు. ఆయా సంస్థలు ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ కామర్స్, ఫుడ్స్ డెలివరీ సేవలను అఫీషియల్ యాప్‌లు, వెబ్‌సైట్ల ద్వారానే పొందాలి. ఆర్డర్స్ క్యాన్సిల్, రీఫండ్ విషయంలో సమస్యలుంటే యాప్, వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి. కొందరు కంప్లైంట్ చేసేందుకు గూగుల్‌లో సంస్థ పేరుతో కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతుకుతారు. అలా చేసినా సమస్యలు వస్తాయి. అందుకే సరైన వాటినే ఎంచుకుని భారీ డిస్కౌంట్ల ఆశతో మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

17 వరకు ఎగ్జిబిషన్ పొడిగింపు

అబిడ్స్, ఫిబ్రవరి 11: నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను రెండు రోజులు పొడిగించేందుకు పోలీస్ శాఖ అనుమతించింది. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు కే నిరంజన్, కార్యదర్శి బీ సురేందర్ రెడ్డి, సభ్యులు సుఖేశ్ రెడ్డి, ధీరజ్ జైస్వాల్‌లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఎగ్జిబిషన్‌ను ఈ నెల 17 వ తేదీ వరకు పొడిగించేందుకు అనుమతి ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రం స్వీకరించిన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ రెండు రోజులు పొడిగింపునకు అనుమతి ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బీ సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ఈ సంవత్సరం మూడో తేదీ నుంచి ప్రారంభించడం జరిగిందని, దీంతో స్టాల్ యజమానులు ఎగ్జిబిషన్ ను పొడిగించాలని విన్నవించారని తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు పోలీస్ శాఖ అనుమతి కోసం వినతిపత్రం సమర్పించామని కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

జవహర్ నగర్‌లో పోలీసు బందోబస్తు మధ్యన నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికార యంత్రాంగం - విషాద వదనంతో బాధిత మహిళలు

నగరంలో కూల్చివేతలు

దుండిగల్ , ఫిబ్రవరి 11:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మండలం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నిజాంపేటలోని సర్వే నం. 334 అసైన్డ్ భూముల్లో వెలసిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు మరోసారి మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. వారం రోజుల క్రితమే ఇక్కడ కొన్ని నిర్మాణాలను తొలగించిన అధికారులు, మంగళవారం ఉదయం మళ్లీ భారీ పోలీసు బందోబస్తు మధ్య బస్తీకి చేరుకొని సుమారు ఆరు నిర్మాణాలతో పాటు కొన్ని షెడ్లు, మరికొన్ని బేస్మెంట్లను కూల్చి వేశారు. దీంతో సదర్ ఇండ్లలో నివాసముంటున్న పేదలు బోరున విలపించారు. ఇండ్లలోని సామాను ఖాళీ చేయించు మరి కూల్చివేతలు చేపడుతూ ఉండటంతో స్థానికుల్లో అధికారుల తీరుపై అసహనం వ్యక్తమైంది. తమకు కనీసం చెప్పకుండానే ఏకధాటిగా కూల్చివేతలు చేపట్టడం తమ బతుకులు ఏం కావాలని మహిళలు విలపించారు. కూలీనాలీ చేసుకుని జీవిస్తున్న తమను ఇలా ఇబ్బందుల పాలు చేయడం తగదన్నారు. అయితే, కొద్దిగా గడువు ఇయ్యాలని, ప్రభుత్వ పెద్దలతో తాము మాట్లాడతామని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మార్వో విజ్ఞప్తి చేయడంతో కొద్దిసేపు కొంచెం నిలిపివేశారు. వాస్తవానికి సర్వే నంబర్ 334 లో ఇటీవల నిర్మించిన వివాదాస్పద నిర్మాణానికి సంబంధించి కూల్చివేతకు వచ్చిన అధికారులు దానిని స్థానికులు అడ్డుకోవడంతో వెనకే ఉన్న పలు ఇళ్లను తొలగించారు. జనాలను ఇండ్లలోంచి బయటికి రప్పించి, సామాను బయట పెట్టించి కూల్చివేతలు చేపట్టడం పట్ల సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

ర్యాంపును కూల్చేసిన టీపీ సిబ్బంది

అక్రమంగా ప్రైవేట్ వైద్యశాల నిర్మాణం

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 11: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 132 జీడిమెట్ల డివిజన్ పైపులైన్ రోడ్డు మార్గంలో ఇటీవల ఏర్పాటు చేసిన కార్పొరేట్ వైద్యశాల నిర్వాహకులు రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ర్యాంపును ఏర్పాటు చేసుకోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేశారు. పైపులైన్ రోడ్డు మార్గంలో ఎన్ హెచ్ 44 ప్రధాన రహదారికి జీడిమెట్ల ఇండస్ట్రియల్ కు అనుసంధానంగా ఉన్న ఈ మార్గంలో ఇటీవల మేడ్ వన్ ప్రైవేట్ ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసుకుని దానికి ముందు రహదారి రోడ్డును ఆక్రమించి ర్యాంపును నిర్మించారు. రాకపోకలకు తీవ్ర ఆటంకాలు రావడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు తమ సిబ్బందితో ర్యాంపును కూల్చివేసి రోడ్డును విస్తరించారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు అంతరాయం తొలగిపోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దుండిగల్ పరిధిలో పోలీసు సిబ్బంది బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను కూల్చివేతలను నిర్వహిస్తున్న అధికార యంత్రాంగం

అక్రమంగా పెద్దలు ఇండ్లు నిర్మించినా, నిబంధనలను పాటించకున్నా వారిని గాని, వాళ్ల ఇండ్లను గాని ఏమీ చేయలేని ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం పేదల గుండెలు పగిలేలా వారి ఇండ్లల్లో గునపాలు దించాయి. అక్రమమైతే, కాస్త సమయం ఇయ్యండి మహాప్రభో! ఖాళీ చేస్తం అని గుండెలవిసేలా రోదించినా.. కండ్లు మూసుకుపోయిన ఆ అధికార మదగజం కనికరించలేదు. ఇష్టారాజ్యంగా పేదల గుడిసెల్లోకి చేరి సామగ్రినంతా రోడ్డు మీదకు విసిరారు. కూలీ బతుకులతో కూడబెట్టుకున్న సామగ్రి నడిరోడ్డుపై పడేస్తుంటే.. ఆ బతుకులు విలవిలలాడాయి. పెద్దింటోడిని ఏమీ చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం పేదింటోడిపై విరుచుకుపడింది. కాళ్లా వేళ్లా పడ్డా వదలలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరుకు ఇది నిదర్శనం.

కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు

పేదల గూళ్లు నిర్దాక్షిణ్యంగా కూల్చివేత

టైమియ్యిరి మహాప్రభో..! అని మొర పెట్టుకున్నా వినని అధికార యంత్రాంగం

ఇంటి, వంట సామగ్రి నడి రోడ్డు మీదకు

గుడిసెలపై విచక్షణారహితంగా బుల్డోడర్లతో దాడి

రోడ్డు పాలైన పిల్లా జెల్లా..

జవహర్‌నగర్, ఫిబ్రవరి 11: పేదల ఇళ్ళపై కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందంటూ జవహర్‌నగర్ ప్రజలు శాపనార్థాలు పెట్టారు. అట్టలు పెట్టుకుని, కవర్లు చుట్టుకుని గుడిసెల్లో బ్రతుకుతున్న.. ఆడబిడ్డలతో క్రిమికిటాలతో కాలం వెళ్ళదీస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాలాంటి పేదలనే టార్గెట్ చేస్తోంది. సారూ! మాకు సమయం ఇవ్వండి. ఖాళీ చేస్తామంటూ అధికారులను వేడుకున్నా తమకు పట్టనట్టు కర్కశంగా ప్రవర్తించారు. గుడిసెలోని వస్తువులను సిబ్బందితో బయటకు తీసి రోడ్డునా పడేసి ప్రభుత్వం దిక్కులేని వారిని చేసిందంటూ బాధితులు దుమ్మెత్తిపోశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు అక్రమ కట్టడాలలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో పోలీస్ సిబ్బంది సాయంతో మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని దేవేందర్‌నగర్‌లో గుడిసెలు వేసుకుని కొన్నేండ్ల నుంచి జీవనం సాగిస్తున్న గుడిసెలపై బుల్డోజర్‌తో గుడిసెలను నేలమట్టం చేశారు. మేమేం పాపం చేశాం... ఐదుసార్లు కూలగొట్టారు. ఒకే ఇంటిని ఐదు సార్లు కూలగొట్టడం చర్చనీయాంశంగా మారింది. మేమేం పాపం చేశాం.. మా ఇంటిని ఐదు సార్లు కులగొట్టడం ఏంటని పేదలు కన్నెర్ర చేశారు. రెవెన్యూ యంత్రాంగం మా ఇండ్లపై పగ బట్టింది. జవహర్‌నగర్‌లో నివసించేది పేదలేనని, కూలికి వెళ్ళితేనే కడుపు నిండుతదని.., రేకులు వేసుకుని జీవనం సాగిస్తున్నామని... ఇంటికి కరెంట్ మీటర్, ట్యాక్సీ ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని ప్రశ్నించారు.

గుడిసెలను కూల్చొద్దని కాళ్లా వేళ్లా పడుతున్న బాధిత మహిళ ను ఈడ్చుకు వెళ్తున్న పోలీసులు

మా శాపనార్థాలు తగులుతాయి

జవహర్‌నగర్‌లో గరీబోళ్ళే బతుకుతారని, కాంగ్రెస్ వస్తే మాలాంటి పేదల బతుకులు మారుతాయని ఆశపడ్డం.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి మాలాంటి పేదల బతుకుల్లో మట్టిని కొడతారని ఊహించలేదని పేదలు కన్నీరు పెట్టుకున్నారు. పేదలు బాగుంటేనే ప్రభుత్వం ఎల్లకాలం సాగుతుందని, పేదలపై ప్రతాపం చూపిన ఏ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవదని శాపనార్థాలు పెట్టారు.

పలుకుబడి ఉన్నోళ్ళకో న్యాయం..! పేదొళ్ళకో న్యాయమా?

పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయంలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, పలుకుబడి ఉన్నోళ్ళు బహుళ అంతస్తులు కడుతున్నా వారి ఇళ్ళను కూల్చకపోవడంలో ఆంతర్యమేమిటి? అంటూ పేదలు పలు రకాల ప్రశ్నలు సంధిస్తున్నారు. పేదల గుడిసెలను బుల్డోజర్‌తో కూలగొడుతున్నారు. కానీ, పలుకుబడి ఉన్నోళ్ళ అక్రమ కట్టడాల వద్ద హంగామా చేస్తూ అధికారులు కాలం వెళ్ళదీశారే.. తప్పితే, పెద్దోళ్ల ఇళ్ళను ముట్టుకోలేదని, ఇదెక్కడి న్యాయం? అంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ సీఐ సైదయ్య, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వీరేంద్ర సాయి, రమేశ్, టీపీవో శ్రవంతి, రెవెన్యూ సిబ్బంది రవి, సాయి, కాశీరాం, మున్సిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జవహర్ నగర్ పరిధిలో కూల్చిన గుడిసెల వద్ద, చిన్నాభిన్నమైన సామగ్రిని చూస్తూ తీవ్ర విషాదంలో ఉన్న బాధిత మహిళలు

మేడ్చల్ జడ్పీ కొనసాగేనా?

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ నాయకుల అయిష్టత

34 గ్రామాలను మున్సిపాలిటీలలో విలీనం చేయాలని సీఎంకు విజ్ఞప్తి

మేడ్చల్, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ): మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జడ్పీ కొనసాగేనా? జిల్లాలో ఉన్న 34 గ్రామాలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేయాలని ప్రభుత్వానికి ఇటీవలే ప్రభుత్వాన్ని జిల్లా అధికారులు కోరిన విషయం తెలిసిందే. ఐతే, మరో పక్క స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఒక వేళ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించినట్లయితే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జడ్పీని కొనసాగించాల్సిందే. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మాత్రం జిల్లాలో సస్పెన్స్‌గానే కొనసాగుతుంది. మిగిలిన 34 గ్రామాలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఉన్నట్లే జడ్పీని కొనసాగిస్తారా? లేక మండలాలను పెంచుతారా?

జిల్లా జడ్పీని కొనసాగింపునకు ఉన్న మూడు మండలాలలతోనే సరిపెడితారా? లేక మరో రెండు మండలాల సంఖ్యను పెంచుతారా? అన్నది అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం రావడం లేదు. 2016వ సంవత్సరంలో ఏర్పడిన మేడ్చల్ జిల్లాలో మొత్తంగా 15 మండలాలు, 61 గ్రామాలు, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలుగా ఏర్పాటు చేశారు. నాలుగు నియోజకవర్గాలు, 10 మండలాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉండగా, 5 మండలాలు, 61 గ్రామాలున్నాయి. ఇటివలే 61 గ్రామాల నుంచి 28 గ్రామాలను మున్సిపాలిటీలలో విలీనం చేసిన క్రమంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 5 మండలాలు మూడు మండలాలుగానే మిగిలాయి. ఉన్న మూడు మండలాలలో జడ్పీని కొనసాగిస్తారా? లేక మరో రెండు మండలాలను పెంచి గతంలో లాగా, 5 మండలాలలో జడ్పీని నిర్వహిస్తారా? అన్నది నోటిఫికేషన్ విడుదల చేసిన రోజునే తెలిపోనుంది.

స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ నేతల అయిష్టత

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ నాయకులు అంతగా ఇష్టం చూపడం లేదు. జిల్లాలో ఉన్న 34 గ్రామాలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు విన్నవించినట్లు తెలిసింది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే లేకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల జరిగితే, కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చే అవకాశం లేదని భావిస్తున్నట్లు సమాచారం.



జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు

మంచినీళ్లివ్వండి మహాప్రభో!

పలు కాలనీల ప్రజల ధర్నా

జల మండలికి బండ్లగూడ వాసుల వినతి

బండ్లగూడ, ఫిబ్రవరి 11: తమ కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు జల మండలి మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తమ కాలనీలలో మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని జల మండలి కార్యాలయం వద్ద పలు కాలనీల వాసులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల అధ్యక్షులు మాట్లాడుతూ, వారానికి ఒక రోజు కూడ తమ కాలనీలో మంచినీళ్లు రావడం లేదని అధికారులకు వివరించారు. రోజు విడిచి రోజు మంచినీళ్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వారు మేనేజర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో శ్రీనివాస్ వారికి ఈ నెల 20వ తేదీలోపు మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. ఇచ్చిన సమయంలోపు సమస్య పరిష్కారం కాకపోతే, ఈ నెల 22వ తేదీన తిరిగి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలి

అధైర్యం వద్దు.. రానున్నది.. బీఆర్ఎస్ రాజ్యమే..

కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 11: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మహేశ్వరం మండలంలోని నాగారంలో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ శ్రేణులు సబితా ఇంద్రారెడ్డికి ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు సబిత ఇంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, మహేశ్వరం మండలంలో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, వార్డు సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందని ఆమె పేర్కొన్నారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదో.. ప్రజలకు వివరించవలసిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టవలసిన ఆవశ్యకత ఉందన్నారు. గత సంవత్సరం కేంద్రం నుంచి గాని, రాష్ట్రం నుంచి గాని గ్రామాలకు ఒక్క పైసా ఇవ్వలేదని ఆమె స్పష్టం చేశారు. ఏం పని చేశారని కాంగ్రెస్ బీజేపీ నాయకులు స్థానిక సంస్థలలో ఓట్లు అడుగుతారని ఆమె అన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలను వారు ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అలాంటి పార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో మరోసారి అవకాశం ఇస్తే గ్రామాలలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందని ఆమె తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తే బీజేపీ నాయకులు ఎందుకు స్పందిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. బీజేపీ కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందే అన్నారు. ఆ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అన్నారు.

రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని సబితారెడ్డి అన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆమె కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికల అయిపోయేంతవరకు అవిశ్రాంతంగా పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెపుతున్న కళ్ల బొల్లి మాటలు నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు.

నాగారంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు